
## ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## బీఎల్ఓలు, బీఎల్ఏలకు ఫారాలు అందజేసిన కొక్కిరాల రాకేష్ రావు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 199 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 15 జులై 2026


## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో
# విమానాశ్రయాల నిర్మాణం

- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం
- ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతోనిర్మించాలని పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. మిగతా2లో...

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు
# ప్రారంభించాలి..

## ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు

- రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ మిగతా2లో...

## ఎన్యూమరేషన్ ఫారాలను
# అందజేయండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి




**హైదరాబాద్,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్‌ఒలకు వెంటనే మిగతా2లో...

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!



**అమరావతి,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభం కాపు ఉద్యమంతో ప్రసిద్ధి చెందిన ముద్రగడ పద్మనాభం ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 73 ఏళ్ల వయసులో అందర్నీ విషాదంలో మిగతా2లో...

## నాణ్యమైన, నిరంతరాయ
# విద్యుత్ సరఫరా

- రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాలు
- ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్లతో ఉప కేంద్రం నిర్మాణం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




## సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

- హోం టూర్ వీడియోల హల్ చల్
- ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తాం-
- ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి






## ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా
# పంటల ప్రణాళిక

మెట్ట పంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ రోజు నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ అధికారులు సమన్వయంతో మిగతా2లో...

## ఊరూరా బీఆర్ఎస్
# కుట్రలపై ప్రచారం

- కెసిఆర్ హయంలోనే కూలిన కాళేశ్వరం
- కేంద్ర నిపుణులు సూచనల మేరకు నీటి విడుదల
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి




**హైదరాబాద్,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపించారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి మిగతా2లో...



## ఆషాఢ బోనాలకు
# భారీగా ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు
- నగర పోలీస్ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష

**హైదరాబాద్,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆషాఢ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాఢ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై మిగతా2లో...

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతో వరంగల్కీలకనగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్ధంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్న ట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయంనిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు (ఈ÷ుక్ష)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైనప్రతిపాదనలుసమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలోనల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వసలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలుకీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకుసహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

**మహబూబ్‌నగర్,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిథులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా పంటల ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. భారత వాతావరణ శాఖ, హైదరాబాద్ సంచాలకురాలుస్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి . సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఇంజినీర్–ఇన్–చీఫ్ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకులు లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రావు, అలాగే ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొ న్నారు. కార్యక్రమంలో ఆయా రంగాలకు సంబం ధించిన నిపుణులు రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

# ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

### ఆస్పత్రుల్లో అభివృద్ధికి కొత్త పాలసీతో ముందుకు వెళుతున్నాం

### ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు

### భద్రాద్రని కొత్తగూడెం జిల్లా ప్రతినిధులతో మంత్రి దామోదర సమీక్ష



**హైదరాబాద్,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లలను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రిని కోరారు. ఎంసీహెచ్, జీజీహెచ్ నడుమ డిస్టన్స్ ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇంచార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలన్నారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్, కొత్తగా 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యేలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కొత్తగూడెం జిల్లాల్లోని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీచింగ్ హాస్పిటల్, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో జనరేటర్లు ఇటీవలే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తమది అటవీ ప్రాంతం అయినందున వర్షాల సమయంలో పవర్ కట్ సమస్య ఉంటుందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు.

# మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!

(మొదటి పేజీ తరువాయి)

ముంచుతూ ఈ లోకాన్ని విడిచి వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ.. తండ్రి వీర రాఘవరావు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. వీర రాఘవరావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా.. 1978లో జనతా పార్టీ ఎమ్మెల్యేగా ముద్రగడ తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన మంత్రిగా సేవలందించారు.కన్నుమూశారు. కొన్ని నెలలుగా ఆనారోగ్యంతో బాధ పడుతున్న ముద్రగడ మంగళవారం సాయంత్రం ప్రాణాలు విడిచారు. హైదరాబాద్ సింధు ఆస్పత్రిలో శ్వాసకోస సమస్యకు చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో ముద్రగడ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో ఏపీలో విషాదం నెలకొంది.

# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి..

(మొదటి పేజీ తరువాయి)

శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్‌ధరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

**హైదరాబాద్,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్దిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలని పేర్కొన్నారు. గతంలో లాగా మభ్య పెట్టే కార్యక్రమంగా కాకుండా పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, అందుకు వీడియోలే సాక్ష్యమనితెలిపారు.

# ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రావాలంటే ఏం చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని చెప్పారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్నామ్యాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు.

గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని నగర సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

(మొదటి పేజీ తరువాయి)

అందజేసి మీ యొక్క అమూల్యమైన ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్‌ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, ఫోటోలను అతికించి బిఎల్‌ఒలకు అందించాలని సిఇఒ కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్‌ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్‌ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్‌ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్‌ఒలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్‌ఒలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించారు. సర్ ప్రక్రియ జూన్ 25 నాడు ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ ప్రక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బిఎల్‌ఒలకు అందజేయాలని సూచించారు.

# ముగ్గురు అక్రమ గంజాయి రవాణా, సరఫరాదారుల అరెస్ట్

**నిందితుల నుండి లక్ష యాభై వేల రూపాయల విలువ చేసే గంజాయి స్వాధీనం**

**సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం**





**కల్లూరు, జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** గంజాయి మత్తుకు అలవాటు పడి, సరఫరా చేస్తున్న కల్లూరు పట్టణానికి చెందిన షేక్ హబీబ్, బొద్దు చందులు, మణుగూరు కు చెందిన తేజావత్ రమేష్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం తెలిపారు. కల్లూరు పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ ముత్తులింగం మాట్లాడుతూ గత ఏడాది 2025 లో షేక్ హబీబ్ అనే నిందితుడు స్నేహితులతో కలిసి ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి వెళ్లి సన్నీ అనే వ్యక్తి దగ్గర నుండి గంజాయి కొనుగోలు చేసి కల్లూరులో చిన్న ప్యాకెట్లుగా చేసి త్రాగే అలవాటు ఉన్నవారికి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించరాని తెలిపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత హబీబ్ కొద్దికాలం బాగానే ఉంటూ కల్లూరులోని ఒక రెస్టారెంట్లో పనిచేశాడని, ఇటీవల ఎటువంటి పని లేకపోవడంతో మణుగూరు అత్తగారింటికి వెళ్ళినప్పుడు పాత స్నేహితుడైన తేజావత్ రమేష్ కలువగా కలిసి ఇరువురు గంజాయి సేవించారని, దాంతో మరల అలవాటు పడి, కల్లూరు వచ్చిన తర్వాత గంజాయి కోసం బొద్దు చందు ని సంప్రదించగా చందు కొద్దిమొత్తంలో 500 రూపాయలకు ముద్దునూరు లో తెచ్చి ఇచ్చాడని, కానీ ధర ఎక్కువగా ఉండడం, గంజాయి తక్కువ రావడంతో హబీబ్, చందులు మరల ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి కి జులై 7 న వెళ్లినారని, అలా వెళ్ళుటకు వాహనం ఏర్పాటు చేసినందుకు తేజవత్ రమేష్ గంజాయిలో వాటా అడగటంతో 500 గ్రాములు తేజవత్ రమేష్ కి ఇచ్చారని తెలిపారు. కల్లూరు వచ్చిన తర్వాత అట్టి గంజాయిని అమ్ముటకు చందు ద్వారా పేరువంచ గ్రామానికి చెందిన ప్రవీణ్, చిన్న ప్రవీణ్, హరీష్ లను సంప్రదించగా వారు ఒప్పుకున్నారని, దాంతో తేజావత్ రమేష్ దగ్గర ఉన్న అరకేజీ కూడా తెప్పించి, ముగ్గురు కలిసి మొత్తం మూడు కేజీలు అమ్మి మల్కనగిరి వెళ్లి మరలా పెద్ద మొత్తంలో లాభాల దురుద్దేశంతో హబీబ్, చందు, రమేష్ లు జులై 13 న బండిపై పేరువంచ వెళ్లుచుండగా షుగర్ ఫ్యాక్టరీ దగ్గర వాహనాలు తనిఖీలో గంజాయితో పోలీసు పట్టుకున్నారని తెలిపారు. ఇట్టి గంజాయి విలువ ఒక కేజీ 50 వేలు రూపాయలు చొప్పున మొత్తం మూడు ఖ+ లు రూ 1,50 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని అన్నారు. ఈ కేసు దర్యాప్తులో లో ఎస్సై హరిత, హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, లక్ష్మీపతిలు, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, సత్యనారాయణ, రఫీ, విజయ్, రంగారావు లు సహకరించినందున వారిని అబినందించారు. గంజాయి అక్రమ కొనుగోలు చేసిన, రవాణాకు పాల్పడిన, విక్రయించిన, సేవించిన నేరామని వారిపై చట్టరీత్య చర్యలు కఠిన చర్యలు చేపట్టబడతాయని అన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారి సమాచారం తెలిపిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడుతుందని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

---

# ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

**అర్హులైన ప్రతి ఓటరు 'సర్" ఫారాలు తప్పనిసరిగా సమర్పించాలి**

**ఐనవోలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్**





**హనుమకొండ ప్రతినిధి,జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్)** : ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే మూలస్తంభమని, దానిని పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ అన్నారు. మంగళవారం వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజ్ ఆదేశాల మేరకు ఐనవోలు మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోహన్ గౌడ్ క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు. అర్హులైన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా నమోదై ఉండేలా అవసరమైన 'సర్" ఫారాలను నింపి, బిఎల్ఏ లకు సమర్పించాలని, ఐనవోలు కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోహన్ గౌడ్, నాయకులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా అయినవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హులైన పౌరుడు తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందని, ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఓటరు నమోదు, మార్పులు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారాల నింపడంలో ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రఘు అన్న, బీఎల్ఏ తాటికాయల ప్రశాంత్, చింత ఏలియా, నాతి మహేష్ తదితరులు పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజలకు "సర్" ప్రక్రియపై వివరాలు తెలియజేస్తూ, ఫారాలు నింపడంలో సహకరించారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

---

# నిరుద్యోగుల మహా ధర్నాను జయప్రదం చేయండి

**• నిరుద్యోగులకు సిపిఎం సంపూర్ణ మద్దతు**



**తల్లాడ, జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నిరుద్యోగుల మహా ధర్నాను జయప్రదం వారికి అండగా సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మన్నేపల్లి రామారావు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మాచర్ల భారతి హాజరై మాట్లాడుతూ ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిర పార్కు వద్ద నిరుద్యోగులు చేపట్టనున్న మహా ధర్నాకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 12 సంవత్సరాలుగా నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని ఆమె విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయకపోగా కోటికి పైగా ఉద్యోగాలను తొలగించిందని ఆరోపించారు.అలాగే గత టీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు, నిధులు నియామకాలు పేరుతో అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని, నిరుద్యోగ భృతి కూడా అమలు చేయకుండా మోసం చేయడంతో ప్రజల ఆగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోయిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను నిరాశపరుస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే యూత్ డిక్లరేషన్ అమలు చేసి, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ప్రతి సంవత్సరం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 15న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే నిరుద్యోగుల మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమౌతు మోహన్‌రావు, షేక్ మస్తాన్, ముచ్చింతల చెన్నయ్య, రాజబోయిన సైదులు, చల్లా నాగేశ్వరరావు, పారాసాని వెంకటయ్య, పులి వెంకట నరసయ్య, మేడి బిక్షం పాల్గొన్నారు.

---

# బిఎల్ఓలు, బిఎల్ఏలకు ఫారాలు అందజేసిన కొక్కిరాల రాకేష్ రావు




**పరకాల, జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ (Special Intensive Revision ` SIR) కార్యక్రమంలో భాగంగా స్థానిక బూత్ లెవల్ అధికారులకు (BLOలు), బూత్ లెవల్ ఏజెంట్లకు (BLAలు) ఓటరు నమోదు, సవరణకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను కొక్కిరాల రాకేష్ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్దడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం కోసం ఎన్నికల సంఘం చేపట్టిన SIR కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ఫారాలను బీఎల్ఓలు, బీఎల్ఏలకు అందజేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ సర్వే నిర్వహిస్తున్న బీఎల్ఓలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని, తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ద్వారా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బండి వెంకటేష్, నాగరాజు, కృపేందర్ రెడ్డి, బీఎల్ఓ రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడీఏ డిప్యూటీ డైరెక్టర్‌గా డి. జనార్ధన్ బాధ్యతల స్వీకరణ



**ఏటూరునాగారం, జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖలో జరిగిన తాజా పరిపాలనా మార్పుల నేపథ్యంలో ఏటూరునాగారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడీఏ)లో డిప్యూటీ డైరెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా డి. జనార్ధన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డి. జనార్ధన్ గతంలో డిప్యూటేషన్ ప్రాతిపదికన ఏటూరునాగారం ఐటిడీఏలో డీడీ (ట్రైబల్ వెల్ఫేర్)గా పనిచేశారు. అనంతరం జారీ అయిన పరిపాలనా ఉత్తర్వుల మేరకు ఆయన నియామకంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తాజాగా తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, హైదరాబాద్ జారీ చేసిన ఆదేశాల మేరకు డి. జనార్ధన్ మళ్లీ ఏటూరునాగారం ఐటిడీఏలో డిప్యూటీ డైరెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా విధుల్లో చేరి, తన జాయినింగ్ రిపోర్టును ఐటిడీఏ ప్రాజెక్టు అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖలో పరిపాలనా బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేయడంలో ఈ నియామకం దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి: ఆర్డీవో కృష్ణవేణి



**ఏటూరునాగారం, జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ములుగు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కృష్ణవేణి మంగళవారం ఏటూరునాగారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో, ఏపీఎం, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్యుమరేషన్ ఫారాల సేకరణతో పాటు వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించాలని, నిర్ణీత గడువులోపు డిజిటలైజేషన్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎలక్షన్ డీటీ నితీష్, డీటీ రాహుల్ వర్మ, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: తెలంగాణ రైతు కూలీ సంఘం




**ఏటూరునాగారం, జులై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏటూరునాగారం తహసీల్దార్ జగదీశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రైతులు సాగునీటి కొరత, విద్యుత్ సరఫరా లోపాలు, ఎరువులు, విత్తనాల కొరత వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం, రైతులపై ఉన్న రుణభారాన్ని తగ్గించడం, అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని వెంటనే అందించాలని కోరారు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా, మండల నాయకులు లతక్క, పద్మక్క, కొమురయ్య, రమేష్, స్వామి, రైతులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్ (ప్రింట్, ఎలక్ట్రానిక్) ఆధ్వర్యంలో ఘనంగా బోడ ప్రవీణ్ జన్మదిన వేడుకలు



**ఉప్పల్ జూన్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ ప్రెస్ క్లబ్ (ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా) ఆధ్వర్యంలో క్లబ్ ఉపాధ్యక్షుడు బోడ ప్రవీణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు బోడ ప్రవీణ్‌ను పూల గుచ్ఛం, శాలువా, జ్ఞాపికతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం బోడ ప్రవీణ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో, ఆనందంగా మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ ( ప్రింట్ ఎలక్ట్రానిక్) సభ్యులు ఇడపాక సురేష్, కదుకూరి ప్రశాంత్, బి వి రాజ్, షేక్ పాషా,నెమ్మది వెంకన్న, పలువురు జర్నలిస్టులు పాల్గొని బోడ ప్రవీణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ చేసిన పాపమే నేడు రైతుల పాలిట శాపం: పులి ఆంజనేయులు గౌడ్



**రాజన్న సిరిసిల్ల జూలెఎ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా హాస్యాస్పదమని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ విమర్శించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మిగులు బడ్జెట్‌తో ప్రారంభమైన రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల పాలుచేసిందని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ.27 వేల కోట్లతో నిర్మిస్తామని ప్రకటించి, చివరకు దాదాపు రూ.1.40 లక్షల కోట్ల వరకు వ్యయం చేసి, నాసిరకం నిర్మాణాలు, అవినీతి, కమిషన్ల కారణంగా ప్రాజెక్టును దెబ్బతీశారని ఆరోపించారు.ఇప్పుడు అదే ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రులు కాళేశ్వరాన్ని "కామధేనువు", "అక్షయపాత్ర"గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం ప్రజలను, రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నమేనని పేర్కొన్నారు.కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, భాక్రా నంగల్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులు నేటికీ సమర్థవంతంగా రైతులకు సాగునీరు అందిస్తున్నాయని, అయితే బీఆర్ఎస్ ఎంతో గొప్పగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం సాంకేతిక లోపాలతో సమస్యల్లో పడిందని విమర్శించారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతు పక్షపాత ప్రభుత్వంగా నిలుస్తోందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని, రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని సూచించారు. ఇలాంటి అసభ్య, నిరాధార వ్యాఖ్యలు కొనసాగితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టిగా తిప్పికొడతారని హెచ్చరించారు.

# కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**• ప్రజా జీవితంలో విశిష్ట ముద్ర వేసిన నాయకుడు**

**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**



**ఖమ్మం, ప్రతినిధి జూలై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ముద్రగడ పద్మనాభం కాపు సామాజిక వర్గం న్యాయమైన హక్కుల సాధన కోసం జీవితాంతం అకుంఠిత దీక్షతో పోరాడారని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ్యుడిగా, మంత్రిగా ప్రజలకు విశేష సేవలందించి ప్రజా జీవితంలో తనదైన ముద్ర వేసిన నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు.ముద్రగడ పద్మనాభం మృతి తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అనుచరులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# జూలై 17 వరకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు గడువు పొడగింపు

**- జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద**



**పెద్దపల్లి, జూలై -14 (పిసిడబ్ల్యూన్యూస్):** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి అందించనున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు గడువు జూలై 17 వరకు పొడగించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని సమస్త యాజమాన్యములలోని ప్రధానోపాధ్యాయులు/ ఉపాధ్యాయులకు 2026-27 విద్యా సంవత్సర మునకు గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందుటకు గాను జూలై 17 లోపు ఆన్‌లైన్ http://nationalaward-stoteach ers. education.gov.in అనే వెబ్ సైట్ లో నమోదు చేసుకోని అట్టి (3) ప్రతిపాదనలను సంబంధిత ధృవపత్రాలతో జిల్లా విద్య శాఖాధికారి కార్యాలయం, పెద్దపల్లిలో సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద ఆ ప్రకటనలో పేర్కోన్నారు.

# పర్యాటక గుమ్మంగా ఖమ్మం.. 'హరిత భవన్'తో కొత్త గుర్తింపు

**- లకారం పార్క్ సమీపంలో రూ.40 కోట్లతో నిర్మాణం**

**నిధుల మంజూరుకు మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ**



**హైదరాబాద్, ప్రతినిధి జూలై 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జిల్లాను రాష్ట్ర పర్యాటక పటంలో ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. లకారం పార్క్ సమీపంలో రూ.40 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో 'హరిత భవన్' నిర్మాణానికి సన్నాహాలు వేగం పుంజుకున్నాయి. ఈ ప్రాజెక్టుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రతిపాదిత నిర్మాణానికి తొలుత హరిత హోటల్'గా పేరు నిర్ణయించినప్పటికీ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా హరిత భవన్ గా పేరు మార్చాలని మంత్రి సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని, పరిపాలనా అనుమతులు మంజూరు చేసి నిర్మాణ పనులు ఎలాంటి జాప్యం లేకుండా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మంత్రి తుమ్మల ప్రత్యేకంగా లేఖ రాసి, రూ.40 కోట్ల నిధులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం ఐదు ఎకరాల భూమిని కేటాయించిందని, నిధులు విడుదలైతే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నారు.హరిత భవన్ నిర్మాణం పూర్తయితే ఖమ్మానికి వచ్చే పర్యాటకులు, భక్తులు, వ్యాపారవేత్తలు, అధికారులకు నాణ్యమైన వసతి అందడంతో పాటు సదస్సులు, సమావేశాలకు అత్యుత్తమ వేదికగా నిలవనుంది. ఈ ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లా రాష్ట్ర పర్యాటక రంగంలో కొత్త గుర్తింపును సొంతం చేసుకోనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కల్లూరులో విద్యా విప్లవానికి శ్రీకారం

**తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో రోబోటిక్స్‌కు ఘన శ్రీకారం భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేసే వినూత్న అడుగు**





**కల్లూరు, జూలై 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** కల్లూరు పట్టణంలో విద్యారంగంలో మరో చారిత్రక ఘట్టానికి తెలంగాణ గ్రామర్ స్కూల్ నాంది పలికింది. ఆధునిక సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో రోబోటిక్స్ విద్యా కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించింది. కల్లూరులో విద్యార్థులకు రోబోటిక్స్ విద్యను అందిస్తున్న తొలి పాఠశాలగా తెలంగాణ గ్రామర్ స్కూల్ ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ ఎస్.కె. జానీమియా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక రోబోటిక్స్ ప్రదర్శనను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పసుమర్తి చందర్ రావు, ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ ఎస్.కె. జానీమియా మాట్లాడుతూ, నేటి ప్రపంచం వేగంగా కృత్రిమ మేధస్సు , ఆటోమేషన్, రోబోటిక్స్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు సంప్రదాయ విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందించడం కాలానుగుణ అవసరమని అన్నారు. విద్యార్థులు చిన్న వయసులోనే రోబోటిక్స్‌పై అవగాహన పెంపొందించుకుంటే భవిష్యత్‌లో ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు.వైస్ చైర్మన్ పసుమర్తి చందర్ రావు మాట్లాడుతూ, రోబోటిక్స్ విద్య ద్వారా విద్యార్థుల్లో సమస్యలను విశ్లేషించి పరిష్కరించే నైపుణ్యం, సృజనాత్మక ఆలోచనా విధానం, శాస్త్రీయ దృక్పథం, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. భవిష్యత్‌లో ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఆటోమేషన్ వంటి రంగాల్లో రాణించేందుకు ఈ శిక్షణ బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన వివిధ రోబోటిక్స్ నమూనాలు, ఆటోమేటిక్ పరికరాలు, సెన్సార్ ఆధారిత ప్రాజెక్టులు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు స్వయంగా తమ ప్రాజెక్టుల పనితీరును వివరించడం అందరినీ ఆకట్టుకుంది. చిన్నారుల్లో దాగి ఉన్న సాంకేతిక ప్రతిభను చూసిన తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, విద్యార్థులను కేవలం పరీక్షలకు మాత్రమే పరిమితం చేయకుండా ప్రపంచంతో పోటీపడే నైపుణ్యాలను అందించడమే తెలంగాణ గ్రామర్ స్కూల్ లక్ష్యమని చెప్పారు. రాబోయే రోజుల్లో రోబోటిక్స్‌తో పాటు కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీ వంటి అంశాల్లో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం ముగింపులో పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికత ఆధారిత నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడం తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త విద్యా విధానాలను నిరంతరం అమలు చేస్తామని స్పష్టం చేసింది. కల్లూరులో తొలిసారిగా ప్రారంభమైన ఈ రోబోటిక్స్ కార్యక్రమం విద్యారంగంలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ, భవిష్యత్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దే దిశగా తెలంగాణ గ్రామర్ స్కూల్ మరో ముందడుగు వేసిందని అభిప్రాయపడ్డారు.

# ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని వేగంగా పెంచాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**20 రోజుల్లో ప్రతి ఏఈఓ 15 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు కృషి చేయాలి**

**తగ్గుతున్న భూగర్భ జలాల దృష్ట్యా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు చైతన్యపరచాలి**

**ప్రతి క్లస్టర్‌లో మహిళా శక్తి కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

**ఆయిల్ పామ్ సాగు, పంటల ప్రణాళికపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, జూలై-14 (పిసిడబ్ల్యూన్యూస్):** జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని వేగంగా పెంచడంతో పాటు నీటి లభ్యతకు అనుగుణంగా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, పంటల ప్రణాళికపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలు ప్రస్తుతం దిగుబడులు ఇవ్వడం ప్రారంభించాయని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరుగుతుండటంతో ఇతర రైతుల్లో కూడా ఈ పంటపై ఆసక్తి పెరుగుతోందన్నారు. గత 45 రోజుల్లోనే సుమారు 300 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాట్లు పూర్తయ్యాయని, రైతుల ఆసక్తి మరింత పెరిగిన నేపథ్యంలో చిన్నపాటి ప్రోత్సాహం కల్పిస్తే జిల్లాకు నిర్దేశించిన 1,100 ఎకరాల లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వచ్చే 20 రోజుల్లో కనీసం 15 ఎకరాలను ఆయిల్ పామ్ సాగుకు మార్చేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి క్లస్టర్‌లో ఈ నెలాఖరులోగా కనీసం 15 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఒకే ప్రాంతంలో 30 నుంచి 40 ఎకరాలు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరిగితే అవసరమైన బోర్‌వెల్లు, ప్రత్యేక విద్యుత్ లైన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. పెద్ద ఎత్తున సాగు జరిగే ప్రాంతాల్లో విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు సుమారు ఒకటిన్నర మీటరు మేర తగ్గడం ఆందోళన కలిగించే అంశమన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రధాన జలాశయాలు, చెక్‌డ్యామ్‌లు నిండితేనే దిగువ ప్రాంతాలకు నీటి లభ్యత ఉంటుందని, ప్రస్తుతం పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని 90 శాతం చెరువుల్లో 50 శాతం కన్నా తక్కువ నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని, రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలు సాగు చేసేలా నిరంతరం చైతన్యం కల్పించాలని ఆదేశించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు, విత్తన విక్రేతలు, ఆదర్శ రైతులు గ్రామస్థాయిలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల పంటలకే కొనుగోలు సదుపాయం ఉంటుందని, ఇతర పంటలకు బోనస్ వర్తించదనే విషయాన్ని ప్రతి రైతుకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.రైతు బీమా క్లెయిమ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, అర్హులైన కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 20 రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.జనగామ జిల్లాలో ప్రతి క్లస్టర్‌లో మహిళా శక్తి కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని, అదే తరహాలో జిల్లాలో కూడా ప్రతి క్లస్టర్‌కు ఒక మహిళా శక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో తిరుమల ఆయిల్ కంపెనీ సీఈవో కళ్యాణ్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ ఉద్యానవన శాఖ అధికారి శ్యాం ప్రసాద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల గురుకుల హాస్టల్ ఆకస్మిక తనిఖీ

### మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణ రెడ్డి

### పరిశుభ్రత, మౌలిక వసతులపై ప్రత్యేక సమీక్ష

**కల్లూరు, జూలై 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/జూనియర్ కళాశాల హాస్టల్‌ను మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తనిఖీలో భాగంగా డైనింగ్ హాల్, వంటశాల, స్పోర్ట్స్ ఏరియా, డ్రైనేజీ వ్యవస్థ, హాస్టల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, తాగునీరు, వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, క్రీడా సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థినులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే హాస్టల్ యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్టల్ పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య







చర్యలు చేపట్టాలని, దోమల నివారణ, వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్ నిర్వహణ, విద్యార్థినుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కమిషనర్, విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రత, క్రీడా సదుపాయాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హాస్టళ్లలో పరిశుభ్రత, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు అని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. హాస్టల్ నిర్వహణ, పరిశుభ్రత, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ పాఠశాల, కళాశాల యాజమాన్యాన్ని అభినందించడం జరిగింది. ప్రిన్సిపల్ పి. కనకదుర్గ, వైస్ ప్రిన్సిపల్ బి. పద్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె రమేష్ , హాస్టల్ సిబ్బంది పి.డి.పి.టి. చిమ్మట త్రివేణి, పీఈటీ సాదం పద్మ పాల్గొన్నారు.

# 49వ డివిజన్లోని ఓటర్లు తమ వివరాలు నమోదు చేసుకోండి..

### • కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ పిలుపు



**కరీంనగర్ టౌన్ 14(పిసి డబ్ల్యూ న్యూస్):** కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ' కార్యక్రమంలో భాగంగా, 49వ డివిజన్ పరిధిలోని ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు, బి.ఎల్.ఓ ల ద్వారా కార్పొరేటర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేస్తున్నారు. ఈ ఫారమ్‌లను ఎలా పూర్తి చేయాలో కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ వివరించారు. భాగం 1) ఓటరు యొక్క ప్రస్తుత వివరాలు. భాగం 2) తల్లి లేదా తండ్రి వివరాలు. 3)ప్రస్తుత నివాస చిరునామా వివరాలు (ఫారమ్‌పై పాస్‌పోర్ట్ సైజు ఫోటో తప్పనిసరిగా అంటించాలి). నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియ కోసం జూలై 14, 15, ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు. సనాతన ధర్మం ఆఫీస్, భాగ్యనగర్ రోడ్ నెం. 6.లో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని 49వ డివిజన్ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ కోరారు. ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓలు గాయత్రి, తిరుమల, రేణుక, వెంకటరవి, అరుణ, తార; బి.ఎల్.ఓ-2లు గోధ, గోని రమేష్, ముదిగంటి ప్రవీణ్, నరోత్తం రెడ్డి, పాశం నరసింహారెడ్డి, బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు పోటీ చేసిన అభ్యర్థులు పటేల్ శ్రీనివాస్ రెడ్డి, సదానందం మరియు పలువురు పాల్గొన్నారు.

# ఓటరు సర్ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

### • బీఎల్ఓలకు పలు సూచనలు చేసిన మేయర్

**కరీంనగర్ టౌన్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని రెండవ డివిజన్ తీగల గుట్టపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఓటరు సర్ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహణను పరిశీలించిన మేయర్, బూత్ స్థాయి అధికారులు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అనర్హుల పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పుల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు






ఓటరు నమోదు, మార్పులు, చిరునామా సవరణ తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్ఓలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చెస్ ఛాంపియన్షిప్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ...

### - 18, 19 తేదీల్లో కరీంనగర్ వేదికగా పోటీలు...




**కరీంనగర్ టౌన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చెస్ చాంపియన్షిప్2026 వాల్ పోస్టర్‌ను మంగళవారం జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి. శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెస్ మేధో వికాసానికి దోహదపడే అత్యుత్తమ క్రీడ అని, ఇలాంటి జాతీయ స్థాయి టోర్నమెంట్ల నిర్వహణ ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి అవకాశం లభిస్తుందని అన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. టోర్నమెంట్ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ, రెండు రోజులపాటు జరిగే ఈ జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. విజేతలకు మొత్తం రూ. 1,25,000 నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నాగరాజు, జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు సృజన్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నల్లా కనెక్షన్లపై వచ్చిన పత్రికా కథనాన్ని తీవ్రంగా పరిగణించిన మేయర్

### సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు కఠిన ఆదేశాలు

### ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు

**కరీంనగర్ జిల్లా 14(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని నల్లా కనెక్షన్ల మంజూరు, ఫీజుల వసూళ్లు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఈరోజు పత్రికలో ప్రచురితమైన కథనాన్ని నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో మేయర్ అధ్యక్షతన సంబంధిత ఇంజినీరింగ్, వాటర్ సప్లై, అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో నల్లా కనెక్షన్ల దరఖాస్తుల స్థితి, పెండింగ్ ఫైల్స్, ఫీజుల వసూళ్లు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, పనుల పురోగతిపై సవివరంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం లేదా అవకతవకలు జరిగినా వాటిని ఏమాత్రం



ఉపేక్షించబోమన్నారు. నల్లా కనెక్షన్ల మంజూరు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సేవలు అందించాలని సూచించారు. ఇకపై పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తప్పవని మేయర్ స్పష్టం చేశారు. అలాగే నల్లా కనెక్షన్లు, తాగునీటి సరఫరా లేదా మున్సిపల్ సేవలకు సంబంధించి ఎవరైనా అనవసరంగా ఇబ్బందులకు గురిచేసినా, ఆలస్యం చేసినా లేదా అక్రమంగా డబ్బులు డిమాండ్ చేసినా వెంటనే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో లేదా సంబంధిత అధికారులకు నేరుగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అందిన ప్రతి ఫిర్యాదుపై తక్షణమే విచారణ జరిపి, నిజానిజాలు నిర్ధారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. "ప్రజా సేవలో బాధ్యత, పారదర్శకత, జవాబుదారీతనమే మా లక్ష్యం. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడం ప్రతి ఉద్యోగి బాధ్యత. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదు"లి అని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జు జు లచ్చిరెడ్డి, ఐజు లు శ్రీనివాస్ ఓం ప్రకాష్ వెంకటేశ్వర్లు ఏ లు, ఫీట్టర్ మరియు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖాజీపూర్‌లో ఇసుక క్వారీని రద్దు చేయాలని గ్రామస్థుల ధర్నా



**కొత్తపల్లి 14(పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్తపల్లి రూరల్ మండలం ఖాజీపూర్ గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న ఇసుక క్వారీ వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ క్వారీని రద్దు చేయాలని కోరుతూ మంగళవారం రోజున గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి అంజనీ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. క్వారీ వద్దే బైఠాయించి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్వారీ కార్యకలాపాల వల్ల వెలువడుతున్న ధూళితో గ్రామాల్లోని ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. నిత్యం వందలాది ఇసుక లారీలు తిరగడంతో గ్రామంలోని రోడ్లు పూర్తిగా పాడయ్యాయని, దీనివల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అడ్డగోలుగా ఇసుకను తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, దీనివల్ల వ్యవసాయం, తాగునీటికి ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు జరుగుతున్న ఇసుక తరలింపు వల్ల గ్రామస్థుల భద్రతకు ముప్పు వాటిల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోమటిరెడ్డి అంజనీ కుమార్ మాట్లాడుతూ "గ్రామ ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా, నిబంధనలకు విరుద్ధంగా క్వారీని కొనసాగిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గ్రామ అవసరాలకు, కనీసం ప్రభుత్వ అవసరాలకు కూడా ఇసుకను ఇవ్వకుండా క్వారీ నిర్వాహకులు అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా గ్రామంలో భూగర్భ జలాలు అడగండి పోతున్నాయని, స్థానికుల ఆరోగ్యం, జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ క్వారీని రద్దు చేయాలనీ లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం" అని ఆయన హెచ్చరించారు.. క్వారీ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసి, ఉన్నతాధికారుల బృందంతో విచారణ జరిపించాలని, గ్రామానికి శాశ్వత పరిష్కారం చూపాలంటూ గ్రామస్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రపంచ రచయిత్రుల 3వ మహాసభలు

### మహిళాభ్యుదయంపై నలుబోల మధుశ్రీ ప్రసంగం

**ఖమ్మం ప్రతినిధి, జూలై 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలుగు భాషా వైభవాన్ని, మహిళా సాహిత్య ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ, కొత్తపేటలోని కె.బి.ఎన్ కళాశాల వేదికగా 3వ అంతర్జాతీయ, ప్రపంచ తెలుగు రచయిత్రుల మహాసభలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రముఖ గాంధేయవాది, మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాల (1926-2026) సందర్భంగా మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 11, 12 (శని, ఆదివారాలు) తేదీలలో రెండు రోజుల మహాసభలను ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే, మహాసభల గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి వందలాది మంది రచయిత్రులు, కవయిత్రులు,




భాషాభిమానులు తరలివచ్చారు. ఈ ప్రతిష్టాత్మక మహాసభల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక సాహిత్య సదస్సులో ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ జర్నలిస్ట్, కవయిత్రి నలుబోల మధుశ్రీ పాల్గొని ప్రసంగించారు. 'ఆధునిక సమాజంలో మహిళాభ్యుదయం - సాహిత్య పాత్ర' అనే అంశంపై ఆమె ఆలోచనాత్మకమైన ప్రసంగాన్ని అందించారు. సమకాలీన సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సాధిస్తున్న ప్రగతిని తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ స్త్రీల చైతన్యానికి, వారి హక్కుల సాధనకు సాహిత్యం ఒక శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడుతోందని ఆమె పేర్కొన్నారు. నాటి నుండి నేటి వరకు కవయిత్రులు తమ కలాల ద్వారా సమాజంలో తెచ్చిన మార్పులను, మహిళాభ్యుదయానికి పడిన పునాదులను ఆమె అద్భుతంగా వివరించారు. ఒక జర్నలిస్ట్‌గా క్షేత్రస్థాయిలో తాను చూసిన మహిళల సమస్యలను, కవయిత్రిగా వాటికి అక్షర రూపం ఇస్తున్న విధానాన్ని ఆమె సభ ముందుంచారు. ఈ సందర్భంగా మధుశ్రీ ప్రసంగానికి సభికుల నుండి, తోటి రచయిత్రుల నుండి ప్రశంసలు దక్కాయి. సభ ముగింపు అనంతరం మహాసభల నిర్వాహకులు, ప్రముఖ సాహితీవేత్తల సమక్షంలో ఖమ్మం కవయిత్రి, జర్నలిస్ట్ నలుబోల మధుశ్రీని శ్వాలువాతో, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ప్రపంచ వేదికపై ఖమ్మం జిల్లా ప్రతిభను చాటినందుకు పలువురు సాహిత్య అభిమానులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## హత్యకేసులో జీవితఖైదు, పది వేలు జరిమానా

- ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్





**ఖమ్మం ప్రతినిధి, జూలై 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :**హత్య కేసులో వరంగల్ జిల్లా, ధర్మసాగర్ మండలం, పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన రాప్రోలు వెంకటేశ్వర్లు ఏ రాజు,32 సం,,కు జీవిత ఖైదు, 10 వేలరూపాయలు జరిమానా విధిస్తూ.. నాలుగోవ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు గౌరవ న్యాయమూర్తి డా. జి.వి. మహేష్ నాథ్ తీర్పు వెల్లడించారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..2021 ఫిబ్రవరి 13 న రాత్రి సమయంలో ఖమ్మం నగరంలో వినోద్ థియేటర్ వద్ద ఓ వివహిత తో మాట్లాడుతున్న శీలం వెంకటేష్ అనే వ్యక్తిపై రాప్రోలు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పాత కక్ష పెంచుకొని హత్య చేసేందుకు కత్తి తో పొడిచి పారిపోయాడు. బాధితుడి బంధువు అయిన ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాపు పూర్తి చేసి అభియోగ పత్రాన్ని న్యాయంస్థానంలో సమర్పించగా.. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన పోలీసు అధికారులకు, ఇన్వెస్టిగేషన్ అధికారులు ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. స్వప్న, కోర్టు కానిస్టేబుల్ యం. రామకృష్ణ,కోర్టు.లైజన్ ఎస్సై శ్రీకాంత్, హోంగార్డ్ శ్రీనివాస్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయాలి: పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం ప్రతినిధి, జూలై 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :**పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసి అభియోగపత్రాన్ని నిర్ణీత గడువులోగా న్యాయస్థానంలో సమర్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు.మంగళవారం జిల్లా పోలీస్ అధికారుల నేరసమీక్ష సమావేశం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...నేర విచారణలో నిందితులకు శిక్షల శాతం పెరగడం అత్యంత ముఖ్యమని, దీనికోసం పకడ్బందీ దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, పోలీసు - ప్రాసిక్యూషన్ సమన్వయం అవసరమన్నారు. కొత్త చట్టాల ప్రకారం నిర్ణీత గడువులోగా ట్రయల్ పూర్తి చేయాలని, సాక్షులు భయపడకుండా భరోసా కల్పిస్తూ... న్యాయస్థానానికి హాజరయ్యేలా చూడాలన్నారు.ఎన్డీపీఎస్ కేసులో న్యాయస్థానంలో నేరాన్ని రుజువు చేయడానికి ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, మాదకద్రవ్యాల స్వభావం, పరిమాణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించే ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ నివేదిక ప్రధాన ఆధారమని అన్నారు. అదేవిదంగా జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను అరికట్టడానికి స్పెషల్ దృష్టి పెట్టాలని, ఈగల్ బృందాలు, టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసుల సమన్వయంతో మూలలను కనిపెట్టాలని అన్నారు. వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని



ఆదేశించారు. చోరీల నివారణకు, దొంగిలించబడిన సొత్తును బాధితులకు తిరిగి అప్పగించడానికి పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తూ రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలాని, నిందితుల గుర్తింపు, రికవరీ వేగవంతం చెయాలన్నారు. విచారణలో భాగంగా ప్రతి కేసును సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ సాక్ష్యాలను సమర్ధవంతంగా వినియోగించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు.శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ...నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే..ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడమే సమర్ధవంతమైన పోలీసింగ్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. శాంతిభద్రతలు, నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్‌లు లేదా బ్లాక్ స్పాట్‌లలో ప్రాణనష్టాన్ని నివారించడానికి రోడ్డు భద్రతా చర్యలు, ఇంజనీరింగ్ మార్పులు, కఠినమైన ట్రాఫిక్ నియంత్రణలు చాలా ముఖ్యన్నారు. ప్రమాదకర మలుపులు, కూడళ్ల వద్ద స్పష్టమైన సైన్‌బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్లు, రంబిల్ స్ట్రిప్స్, గరిష్ఠ వేగపరిమితి సూచికలు పెట్టడం, రాత్రి సమయంలో స్పష్టత కోసం సోలార్ లైట్లు, వీధి దీపాలు మెరుగుపరచడం. గుంతలను పూడ్చడం, జారుడు రోడ్లకు తగిన గుర్తులు వేయడం వంటి చర్యలు సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు వసుందర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, ఫణిందర్,నర్సింహారావు, సర్వర్, సత్యనారాయణ, సాంబరాజు పాల్గొన్నారు.

## గౌడ కులస్తులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ



**రామడుగు, జూలై 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కత్తి సమత మధు ఆధ్వర్యంలో గౌడ కులస్తులకు కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రామడుగు మండల అధ్యక్షుడు కత్తి మధు, గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు దైవాల మల్లేశం గౌడ్, పొన్నం మహేష్ గౌడ్, బత్తిని వెంకటేష్ గౌడ్, దైవాల తిరుపతి గౌడ్, ఏపూరి వీర గౌడ్, బత్తిని తిరుపతి గౌడ్ తదితర గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీకి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌కు గౌడ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**డ్రైనేజీ డిజైన్‌ను తక్షణమే ఖరారు చేసి పూర్తి కార్యాచరణ నివేదిక ఇవ్వాలి**

**పెండింగ్‌లో ఉన్న రెండు స్ట్రెచ్‌లలో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి**

**మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణం, భూ సేకరణ, లేఅవుట్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, భూసేకరణ, డ్రైనేజీ, లేఅవుట్ అభివృద్ధి, తదితర అంశాలను నిర్దిష్ట గడువుల్లోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణ పనుల పురోగతి, ఎన్ఎస్పీ భూముల్లో లేఅవుట్ అభివృద్ధి, డ్రైనేజీ డిజైన్, భూసేకరణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్ఎస్పీ భూముల్లో లేఅవుట్ అభివృద్ధికి సంబంధించి అధికారులు అప్రోచ్ రోడ్డు, వంతెన నిర్మాణ ప్రతిపాదనలు సమర్పించారని, అయితే జాతీయ రహదారుల శాఖ ఇంజినీర్ సూచించిన విధంగా నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుపై సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సవరించిన తుది ప్రతిపాదనను రెండు రోజుల్లో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.మున్నేరు పరిరక్షణలో భాగంగా చేపడుతున్న డ్రైనేజీ వ్యవస్థ రూపకల్పనను అత్యవసరంగా ఖరారు చేయాలని సూచించారు. ప్రధాన డ్రైన్లు, ఉప డ్రైన్లు ఎక్కడ ఉంటాయి, ఆయా డ్రైన్ల ద్వారా నీరు ఎక్కడికి మళ్లించబడుతుంది, మొత్తం డ్రైనేజీ నెట్‌వర్క్ ఎలా పనిచేస్తుందనే అంశాలతో కూడిన సమగ్ర సాంకేతిక నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. భూసేకరణ పెండింగ్‌లో ఉన్న ప్రాంతాలు మినహా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్న రెండు స్ట్రెచ్‌లలో పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.లేఅవుట్ అభివృద్ధి వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను పూర్తిగా వివరించి, సానుకూల దృక్పథం ఉన్న భూ యజమానులతో వెంటనే చర్చలు ప్రారంభించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల్లో అపోహలు తొలగేలా పూర్తి అవగాహన కల్పిస్తూ పరస్పర విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.మతపరమైన నిర్మాణాలు, శ్మశానవాటికలు వంటి సున్నితమైన అంశాల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల మనోభావాలు దెబ్బతిన కుండా సామరస్యపూర్వకంగా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు ముందుకు సాగాలని, సాంకేతిక అంశాలు, భూసేకరణ, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ వాణిశ్రీ, పీఆర్ ఇఇ మహేష్ బాబు, వివిధ శాఖల ఈఈలు, డీఈలు, ఖమ్మం అర్బన్ తహశీల్దార్లు, అధికారులు, పాల్గొన్నారు.

# టిజి 20 రన్నర్స్‌ను ఘనంగా సన్మానించిన యస్.బి.ఐ.టి








**ఖమ్మం ప్రతినిధి, జూలై 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణాలో యువ క్రికెటర్ల నైపుణ్యాల ప్రదర్శనకు గొప్ప వేదికగా నిలిచిన టిజి 20 క్రీడలలో రన్నర్స్ గా నిలిచిన ఖమ్మం ఏసెస్ ను స్థానిక యస్.బి.ఐ.టి ఇంజనీరింగ్ కళాశాల మంగళవారం ఘనంగా సన్మానించింది. కళాశాల విద్యార్థుల కేరింతల మధ్య ఛైర్మన్ గుండాల కృష్ణ, తెలంగాణా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నందిని విక్రమార్క మల్లు అతిధులుగా పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించి సత్కరించారు. తొలి సీజన్‌లోనే టోర్నీ ఆరంభం నుండే అద్భుత ప్రదర్శనతో ఫైనల్స్‌కు చేరుకున్నారని, రానున్న సీజన్‌లలో తప్పకుండా విజయం సాధించి ఖమ్మం కీర్తిను చాటుతారని గుండాల కృష్ణ ఆశాభావం వ్యక్తం చేసారు. జట్టులోని సభ్యులందరు తమ వంతు పాత్ర పోషించడంతోనే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమైనవని నందిని విక్రమార్క మల్లు అభిప్రాయపడ్డారు. కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ కళలు, క్రీడలను ప్రోత్సహించడంలో ఖమ్మం జిల్లా ముందుంటుందని, దానికి నిదర్శనమే నేటి ఈ విజయం అని అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర స్థాయిలో ఖమ్మం జట్టు నిలవడంతో ఖమ్మం జిల్లా ప్రజల ఆదరాభిమానాలను జట్టు సభ్యులు పొందగలిగారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ జిల్లా జట్టు కెప్టెన్ ఛామా వజ్రేంద్ర మిలింద్, సహేంద్ర విక్రమాదిత్య మల్లులతో పాటు జట్టు సభ్యులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జట్టు హెడ్ కోచ్ అభిజీత్ ఛటర్జి, టీమ్ మెంటర్ హరిమోహన్, జట్టు ఫ్రాంచైజ్ ఓనర్ గోపన్న అచ్యుతరావుతో పాటు, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, వివిధ విభాగ అధిపతులు, విద్యార్థులు,పాల్గొన్నారు.



# ఖమ్మం క్రీడా వేదికగా 'అన్వితా ఏసెస్' టీమ్‌కు ఘన సన్మానం

**ఖమ్మం ప్రతినిధి, జూలై 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి, రన్నర్స్ అప్‌గా నిలిచిన అన్వితా ఏసెస్' క్రికెట్ జట్టును ఖమ్మం జిల్లా క్రీడా ప్రముఖులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడా ఔత్సాహికులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లు నందిని హాజరై మాట్లాడారు. అన్వితా ఏసెస్ టీమ్ ప్రదర్శించిన పోరాట పటిమ ఖమ్మం జిల్లాకు గర్వకారణమని కొనియాడారు.**క్రీడా సంఘాల మద్దతు :** ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఉప్పల్ రెడ్డి , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రామారావు, స్కూల్ క్రీడా కారులు,అభినందించారు. జిల్లా క్రీడాధికారి సునీల్ కుమార్ రెడ్డి , స్టేడియం మేనేజర్ ఉదయ్ కుమార్, నాగమణి, స్టేడియం కోచ్‌లు ఈ విజయాన్ని పంచు కున్నారు.**శిక్షకుల ప్రోత్సాహం :**సీనియర్ క్రికెట్ నిర్వాహకులు మహమ్మద్ మతిన్ క్రీడా శిక్షకులు పరిపూర్ణ చారి హరీష్, చంద్రకాంత్, సురేష్, కొండలరావు, టేబుల్ టెన్నిస్ కోచ్ మూర్తి, నాగరాజు, మోహనరావు తదితరులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. **విజయ రహస్యం :** ఫ్రాంచైజ్ ఓనర్లు అచ్యుత రావు బొప్పన, సరితా బొప్పన, అన్వితా బొప్పన అనూప్ బొప్పన మాట్లాడుతూ, జట్టు కఠిన శ్రమకు ఈ విజయం ప్రతిఫలమని తెలిపారు. జట్టు కెప్టెన్ సివి





మిలంద్ స్పందిస్తూ ఖమ్మం ప్రజల ప్రేమాభిమానాలు తమను మరింత ప్రోత్స హిస్తున్నాయని కృతజ్ఞతలు తెలి పారు. ఖమ్మం క్రీడాకారులు అజర్, విశాల్, మహేష్‌లు సన్మాన కారిక్రమములో ఉండగా ఈ కార్యక్రమ నిర్వ హణ బాధ్యతలను సైదులు, మతీన్ నిర్వహించారు.

# వన్డేలను 40 ఓవర్లకు కుదిస్తే ఒప్పుకునేది లేదు

## ఇండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్




టి20 ల హవా, రకరకాల ఫ్రాంచైజీ లీగుల ఎఫెక్ట్ వల్ల వన్డే క్రికెట్ ప్రెజెంట్ తీవ్ర సంక్షోభాన్ని ఫేస్ చేస్తోంది. రీసెంట్ గా ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ యాన్యువల్ కాన్ఫరెన్స్ లో వన్డే మ్యాచులను 50 ఓవర్ల నుంచి 40 ఓవర్లకు కుదించేలా మేజర్ డిస్కషన్స్ జరిగాయి. ఈ హాట్ టాపిక్ పై మంగళవారం ఇంగ్లాండ్‌తో జరగబోయే ఫస్ట్ వన్డే మ్యాచ్ కు ముందు జరిగిన ప్రెస్ మీట్ లో ఇండియా వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చాలా స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యాడు. వన్డేలను 40 ఓవర్లకు మార్చాలనే ఐడియాను గిల్ కంప్లీట్ గా రిజెక్ట్ చేశాడు. వన్డే ఫార్మాట్ ను మళ్లీ ఇంట్రెస్టింగ్ గా మార్చడానికి బైలాటరల్ సిరీస్ ల కంటే పాత రోజుల్లో లాగా ట్రయాంగులర్ లేదా క్వాడ్రాంగులర్ సిరీస్ లను మళ్లీ స్టార్ట్ చేయాలని గిల్ ఒక క్రేజీ ఐడియాను ఐసీసీ ముందుకు తెచ్చాడు. “వన్డేలను 40 ఓవర్లకు తగ్గించాల్సిన అవసరం అస్సలు లేదు. మేము చిన్నప్పుడు ఆస్ట్రేలియా, ఇండియా, శ్రీలంక జట్ల మధ్య జరిగే ట్రయాంగులర్ సిరీస్ లను విపరీతంగా ఎంజాయ్ చేసేవాళ్ళం. రెండు వేర్వేరు బలమైన జట్లతో డిఫరెంట్ వెన్యూస్ లో తలపడటం వల్ల చూసే ఆడియన్స్ కు, ఆడే ప్లేయర్లకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ దొరుకుతుంది” అని 26 ఏళ్ల గిల్ అభిప్రాయపడ్డాడు. తన చిన్నతనం అంతా 50 ఓవర్ల క్రికెట్ తోనే సాగిందని, వరల్డ్ కప్ అనగానే ప్రతీ ఒక్కరికీ గుర్తొచ్చేది 50 ఓవర్ల మెగా ఈవెంట్ మాత్రమేనని చెప్పాడు. క్రికెట్ లో ప్రతీ ఒక్కరూ గెలవాలని కలలు కనే మోస్ట్ ప్రెస్టీజియస్ ట్రోఫీ 50 ఓవర్ల వరల్డ్ కప్పేనని గిల్ ఎమోషనల్ గా గుర్తుచేసుకున్నాడు. ఈ వన్డేల భవిష్యత్తు ముచ్చట్లలోనే 2027 లో సౌతాఫ్రికా వేదికగా జరగబోయే వన్డే వరల్డ్ కప్ ప్లాన్స్ పై గిల్ ఓపెన్ అయ్యాడు. “సౌతాఫ్రికాలో ఉండే వికెట్లు ప్రెజెంట్ ఇంగ్లాండ్ లో మేము ఆడే వికెట్లకు చాలా సిమిలర్ గా ఉంటాయి. కాబట్టి మాకు ఏ కాంబినేషన్ బెస్ట్ గా సెట్ అవుతుందో టెస్ట్ చేయడానికి ఈ ఇంగ్లాండ్ సిరీస్ ఒక పర్ఫెక్ట్ ల్యాండ్‌మార్క్ లాంటిది. వరల్డ్ కప్ ప్రిపరేషన్ లో ఈ మ్యాచ్ లు చాలా కీ రోల్ ప్లే చేస్తాయి” అని కెప్టెన్ చెప్పాడు. ఈ త్రీ-మ్యాచ్ సిరీస్ ద్వారా తన లీడర్‌షిప్ ఎక్స్‌పీరియన్స్ ను మరింత బిల్డ్ చేసుకోవాలని చూస్తున్నట్లు, ప్రతీ మ్యాచ్ నుంచి నేర్చుకునే విషయాలు వరల్డ్ కప్ లో ఎంతో క్రూషియల్ అవుతాయని గిల్ క్లారిటీ ఇచ్చాడు. టీమ్ లో మాటిమాటికీ ప్లేయర్లను మార్చడం వల్ల అన్‌సెటిల్డ్ ఎలెవన్ అనే ఫీలింగ్ రావడం లేదని, యంగ్ ప్లేయర్లకు ప్రెజర్ సిట్యుయేషన్స్ లో ఛాన్సులు ఇస్తేనే వాళ్లు వరల్డ్ కప్ కల్లా పక్కాగా సెట్ అవుతారని గిల్ అన్నాడు. “మేము కొంత అన్‌లక్కీ అని చెప్పాలి. సిరీస్ స్టార్ట్ అవ్వకముందే నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా లాంటి కీ ప్లేయర్లు గాయాల బారిన పడ్డారు. వాళ్లకు ఎక్కువ మ్యాచులు ఆడించి సెటిల్ చేద్దాం అనుకున్నా కుదరలేదు. అందువల్లే డిఫరెంట్ కాంబినేషన్స్ ట్రై చేయాల్సి వచ్చింది తప్ప టీమ్ లో ఎలాంటి ఇన్-స్టెబిలిటీ లేదు” అని గిల్ పక్కాగా చెప్పాడు. వరల్డ్ కప్ లో 11 మ్యాచులు ఆడాల్సి ఉంటుందని, కాబట్టి ఇంగ్లాండ్, న్యూజిలాండ్ లాంటి బిగ్ సిరీస్ లలో యంగ్ ప్లేయర్లు ఒత్తిడిని తట్టుకుని బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇవ్వడం మోస్ట్ ఇంపార్టెంట్ అని కెప్టెన్ గిల్ స్పష్టం చేశాడు.



# మళ్లీ గంభీర్ X కోహ్లీ డిష్యూం డిష్యూం...

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభానికి ముందు ఈ ఇద్దరు మాట్లాడుకోవడం లేదనే వార్తలు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.బర్మింగ్‌హామ్ వేదికగా జరిగే తొలి వన్డేలో ఆతిథ్య ఇంగ్లండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ కోసం భారత ఆటగాళ్లు బాగా సన్నదమయ్యారు. నెట్స్‌లో గంటల తరబడి చెమటోడ్చారు. అయితే ప్రాక్టీస్ సెషన్స్‌లో కోహ్లీ, గంభీర్ ఒక్కసారి కూడా మాట్లాడుకోలేదనే పోస్ట్‌లు సోషల్ మీడియా వేదికగా హల్‌ఛల్ చేస్తున్నాయి.విరాట్ కోహ్లీ నెట్ ప్రాక్టీస్ సెషన్‌ను ప్రత్యేకంగా గమనించిన గంభీర్.. అతనితో నేరుగా మాట్లాడకుండా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌కు చెప్పి మరీ మాట్లాడించడం ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు సంబంధించిన వీడియో కూడా నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోలో అనవసర షాట్స్ ఆడబోయిన కోహ్లీ పలుమార్లు క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ప్రాక్టీస్ సెషన్ ముగిసిన తర్వాత కోహ్లీతో గంభీర్ నేరుగా మాట్లాడకుండా బ్యాటింగ్ కోచ్‌తో మాట్లాడించడం ఈ విభేదాల వార్తలకు బలం చేకూరుస్తోంది.ప్రాక్టీస్ సెషన్స్ సందర్భంగా గంభీర్ తరుచూ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌లతో మాట్లాడినట్లు తెలుస్తోంది. నేరుగా కోహ్లీతో గంభీర్ మాట్లాడిన సందర్భం ఒక్కటి కూడా లేదని ఓ జాతీయ మీడియా పేర్కొంది. ఫైనల్ ప్రాక్టీస్ సెషన్‌లో జట్టులోని ఇతర ఆటగాళ్లందరితో మాట్లాడిన గంభీర్.. కోహ్లీతో మాత్రం మాట్లాడకపోవడం చర్చనీయాంశమైంది. కోహ్లీ కూడా గంభీర్‌తో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. దాంతో జట్టులో వాతావరణం అంతా సవ్యంగానే ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో ఐపీఎల్ సందర్భంగా పలుమార్లు ఈ ఇద్దరూ గొడవపడ్డారు. కానీ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రొఫెషనల్ ప్లేయర్లలా కలిసి మెలిసి పనిచేశారు. కానీ ఏమైందో ఏమో తెలియదు కానీ.. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు ఈ ఇద్దరూ మాట్లాడుకోవడం లేదనే వార్తలు అభిమానులను గందరగోళానికి గురి చేస్తున్నాయి. ఇప్పటికే టీ20ల్లో క్లీన్ స్వీప్ అయిన టీమిండియా.. కనీసం వన్డేల్లోనైనా గెలవాలని భావిస్తుంది. ఈ క్రమంలో కోహ్లీ, గంభీర్ మధ్య విభేదాలు మ్యాచ్‌ల ఫలితాలపై ఏ మేర ప్రభావం చూపుతాయోననే ఆందోళన అభిమానుల్లో నెలకొంది.

# కెప్టెన్సీలో ధోని రికార్డును సమం చేసిన శ్రేయస్ అయ్యర్



టి20 ప్రపంచకప్ 2026 నెగ్గిన తర్వాత నుంచి భారత జట్టుకు దరిద్రం పట్టుకున్నట్లు ఉంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో జరిగిన టి20 సిరీస్‌ల్లో భారత జట్టు ఘోర పరభవాన్ని మూటగట్టుకుంది. మొత్తం 7 మ్యాచ్‌లు జరిగితే.. ఆరింటిలో ఓడింది. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. ఈ రెండు పర్యటనల్లో భారత జట్టు ఏ మాత్రం ఫైటింగ్ చేయలేకపోయింది. చివరికి ఐర్లాండ్ చేతిలో కూడా ఘోరంగా ఓడింది. తొలిసారి ఐర్లాండ్ చేతిలో సిరీస్‌ను కోల్పోయింది. టి20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత జట్టులో మార్పులు జరిగాయి. సూర్యకుమార్ యాదవ్‌పై వేటు పడింది. ఫలితంగా శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పజెప్పారు. ఈ క్రమంలో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ధోని రికార్డును సమం చేశాడు. భారత కెప్టెన్‌గా ఒక్క మ్యాచ్ గెలవని శ్రేయస్ అయ్యర్.. ధోని రికార్డును సమం చేయడం ఏంటంటూ మీరు ఆశ్చర్యపోవచ్చు. అయితే అది నిజం. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో భారత జట్టు 7 టి20లను ఆడింది. ఇందులో ఒక మ్యాచ్ రద్దు కాగా.. మిగిలిన 6 మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. అయితే ఈ 7 మ్యాచ్‌ల్లోనూ టాస్ శ్రేయస్ అయ్యరే గెలిచాడు.వరుసగా 7 టాస్‌లు గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గతంలో భారత జట్టు వరుసగా టాస్‌లను ఓడిపోయింది. గతేడాది జరిగిన ఆసియా కప్‌లో అయితే సూర్యకుమార్ యాదవ్ టాస్ గెలవడం కోసం లెఫ్టాండ్ తో కూడా స్పిన్ చేశాడు. కానీ, ఓడాడు. అయితే శ్రేయస్ అయ్యర్ మాత్రం కెప్టెన్‌గా 7 టాస్‌ల్లోనూ గెలిచాడు.గతంలో మహేంద్ర సింగ్ ధోని వరుసగా 7 సార్లు టాస్ నెగ్గాడు. ఆ తర్వాత మరో భారత కెప్టెన్ ఇలా చేయలేకపోయాడు. తాజాగా శ్రేయస్ అయ్యర్ ఈ ఘనతను అందుకున్నాడు. అయితే భారత కెప్టెన్‌గా ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్‌లో కూడా విజయం సాధించలేకపోయాడు.టి20 సిరీస్‌లో ఘోర ఓటమి తర్వాత భారత జట్టు వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. మంగళవారం నుంచి ఆరంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఇంగ్లండ్‌ను ఎదుర్కోనుంది. అయితే ఈ సిరీస్ కోసం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ ప్రీత్ బుమ్రా, శుభ్‌మన్ గిల్‌లు భారత జట్టులోకి రానున్నారు. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ కోసం ఈ సిరీస్‌తో సన్నాహకాలు ఆరంభం కానున్నాయి. రోహిత్ శర్మ, కోహ్లీలు ఎంట్రీ ఇవ్వడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొని ఉంది. ఈ మూడు వన్డేల్లో భారత్ గెలుస్తుందో.. లేదంటే టి20 సిరీస్ ప్రదర్శననే కొనసాగిస్తుందో చూడాలి.

# రెండో వన్డేలో విండీస్‌ను ఓడించిన న్యూజిలాండ్



రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచిన న్యూజిలాండ్ ఐదు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. కివీస్ ఎడమచేతి వాటం స్పిన్నర్ జేడెన్ లెనాక్స్ అద్భుత ప్రదర్శనతో వెస్టిండీస్ కుప్పకూలింది. లెనాక్స్ 19 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో కరేబియన్ జట్టు 138 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం న్యూజిలాండ్ 104 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. వెస్టిండీస్‌లోని గయానా వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత వెస్టిండీస్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు రాణించడంతో విండీస్ ఓ దశలో 10.3 ఓవర్లకు 63/0తో నిలిచింది. ఇక్కడే అసలు కథ మొదలైంది. లెనాక్స్ అద్భుతమైన బౌలింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. 8 ఓవర్లలో 19 రన్స్ ఇచ్చి.. 5 వికెట్లు తీశాడు. దీంతో ఆతిథ్య జట్టు కేవలం 75 పరుగుల వ్యవధిలో 10 వికెట్లు కోల్పోయి 138 పరుగులకే ఆలౌట్ అయింది. వెస్టిండీస్ బ్యాటర్లలో జాన్ క్యాంప్‌బెల్ 43 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వెస్టిండీస్ కేవలం 10 ఓవర్లలోనే తమ చివరి 5 వికెట్లు కోల్పోయింది. 31 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన లెనాక్స్.. తన ఏడో వన్డేలో కెరీర్‌లో తొలిసారిగా ఐదు వికెట్ల ప్రదర్శనను నమోదు చేశాడు. ఎనిమిది ఓవర్లలో 19 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో వన్డే క్రికెట్‌లో న్యూజిలాండ్ స్పిన్నర్లలో మూడో అత్యుత్తమ బెస్ట్ నమోదు చేశాడు. ఎక్కువగా టర్న్ అవుతున్న పిచ్‌పై న్యూజిలాండ్ బ్యాటర్లు కూడా ఇబ్బంది పడ్డారు. 96 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది కివీస్. ఈ సమయంలో టామ్ లాథమ్ 37 రన్స్‌తో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. మైకెల్ బ్రేస్ వెల్ (24) కూడా రాణించడంతో న్యూజిలాండ్.. 32.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి.. ఛేజ్ పూర్తి చేసింది. వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో న్యూజిలాండ్‌కు ఇది 400వ విజయం కావడం గమనార్హం. ఐదు మ్యాచులో సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలుపొందగా, న్యూజిలాండ్ తాజా విజయంతో సిరీస్ 1-1తో సమమైంది. మూడో వన్డే జులై 17న గయానా వేదికగా జరగనుంది. గయానా వేదికగా జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. కివీస్ స్పిన్నర్ ఐదు వికెట్లతో చెలరేగడంతో ఈ మ్యాచ్ గురించి తెలుసుకోవడానికి భారత క్రికెట్ అభిమానులు ఆసక్తి కనబర్చారు. దీంతో కీవర్డ్ 2 లక్షలకుపైగా సెర్చ్ వాల్యూమ్‌తో గూగుల్ ట్రెండ్స్‌లో టాప్‌లో నిలిచింది.

# ఇంగ్లాండ్ నయా ఓపెనర్‌గా జాకబ్ బెథెల్ ప్రమోషన్..

ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగబోయే త్రీ-మ్యాచ్ వన్డే సిరీస్ కోసం క్రేజీ సమరానికి టైమ్ ఫిక్స్ అయింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా మంగళవారం జరగబోయే ఫస్ట్ వన్డే మ్యాచ్ కోసం హోస్ట్ టీమ్ ఇంగ్లాండ్ తమ స్ట్రాంగ్ ప్లేయింగ్ ఎలెవన్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేసింది. ఈ మ్యాచ్ లో యంగ్ అండ్ డైనమిక్ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్, సీనియర్ బ్యాటర్ బెన్ డకెట్‌తో కలిసి ఓపెనర్ గా బరిలోకి దిగబోతున్నట్లు మేనేజ్‌మెంట్ కన్ఫర్మ్ చేసింది. ఈ మ్యాచ్ ఇంగ్లాండ్ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ జోస్ బట్లర్ కెరీర్ లో ఒక మైండ్ బ్లాకింగ్ పర్సనల్ మైల్‌స్టోన్ గా నిలవబోతోంది. బట్లర్ తన ఇంటర్నేషనల్ కెరీర్ లో 200వ వన్డే మ్యాచ్ ఆడబోతున్నాడు. ఇంగ్లాండ్ వైట్ బాల్ సెటప్ లో మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ అయిన జోస్ బట్లర్, ఫిబ్రవరి 21, 2012 న దుబాయ్ వేదికగా పాకిస్తాన్‌పై తన ఫస్ట్ వన్డే డెబ్యూ ఇచ్చాడు. అప్పటి నుంచి ప్రెజెంట్ వరకు వన్డే ఫార్మాట్ లో 39.11 యావరేజ్ తో ఏకంగా 5,515 రన్స్ స్కోర్ చేశాడు. ఇందులో 11 సెంచరీలు, 29 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

టీ20 సిరీస్ ను 4-0 తో క్లీన్ స్వీప్ చేసిన జోష్ లో ఉన్న ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్, లాస్ట్ నవంబర్ తర్వాత ఫస్ట్ టైమ్ వన్డే సెటప్ లోకి గ్రాండ్ గా కంబ్యాక్ ఇచ్చాడు. ఆర్చర్ తో పాటు జోష్ టంగ్ పేస్ బాధ్యతలు చూసుకోనుండటంతో గస్ అట్కిన్సన్ కు ప్లేయింగ్ ఎలెవన్ లో ప్లేస్ దక్కలేదు. ఎడ్జ్‌బాస్టన్ మ్యాచ్ తర్వాత కార్డిఫ్ (జూలై 16), లార్డ్స్ (జూలై 19) వేదికల్లో మిగతా మ్యాచులు జరగనున్నాయి. ఫస్ట్ వన్డే కోసం ఇంగ్లాండ్ అఫీషియల్ స్క్వాడ్ లో జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), సామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, అదిల్ రషీద్ బరిలోకి దిగుతున్నారు.

# యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో భారత క్లబ్‌లు అద్భుత ప్రదర్శన

## • పంజాబ్ ఎఫ్‌సీకి 5-0 భారీ విజయం




జపాన్‌లో జరుగుతున్న యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌లలో భారత అభివృద్ధి జట్లు (డెవలప్‌మెంట్ స్క్వాడ్స్) ఆకట్టుకునే ప్రదర్శన కనబర్చాయి. జూలై 14, 2027న కురాటే (జపాన్) వేదికగా జరిగిన పోటీల్లో భారత క్లబ్‌లు జపాన్ జే-లీగ్‌కు చెందిన జట్లతో తలపడగా, రెండు జట్లు విజయాలు నమోదు చేయగా, మరో జట్టు తృటిలో ఓటమి చవిచూసింది. రోజంతా జరిగిన మ్యాచ్‌ల్లో అత్యంత ఏకపక్ష విజయాన్ని పంజాబ్ ఎఫ్‌సీ నమోదు చేసింది. అవిస్పా ఫుకుఓకాపై 5-0 తేడాతో ఘన విజయం సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మ్యాచ్ ప్రారంభమైన మూడు నిమిషాల్లోనే సింగమయుమ్ షామి తొలి గోల్ నమోదు చేయగా, 28వ నిమిషంలో మరోసారి గోల్ చేసి జట్టుకు బలమైన ఆధిక్యం అందించాడు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 42వ నిమిషంలో ఒమాంగ్ డోడుమ్ మరో గోల్ సాధించాడు. రెండో అర్ధభాగంలో 55వ నిమిషంలో నగారిన్ షైజా స్కోరు పెంచగా, ఇంజరీ టైమ్ (90o2)లో విశాల్ యాదవ్ ఐదో గోల్ చేసి పంజాబ్ ఎఫ్‌సీ విజయాన్ని మరింత ఘనంగా నిలిపాడు. మరో ఆసక్తికర మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ 3-2 తేడాతో గిరావాంజ్ కిటాక్యూషుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 40వ నిమిషంలో ర్యునోసుకే ఇమై గోల్ చేయడంతో జపాన్ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే రెండో అర్ధభాగంలో బెంగళూరు ఎఫ్‌సీ అద్భుతంగా పుంజుకుంది. 61వ నిమిషంలో రక్షిత్ రక్షిత్ ప్రియా అనిల్ సమం చేసే గోల్ నమోదు చేశాడు. ఒక స్వీయ గోల్ కారణంగా మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారినప్పటికీ, 75వ నిమిషంలో సెర్టో వోర్నీలెన్ కోమ్ కీలక గోల్ సాధించాడు. చివరి నిమిషాల్లో జట్టు సమిష్టి రక్షణ ఆకట్టుకోగా, 90వ నిమిషంలో ఎండీ అర్బాష్ గోల్ చేసినప్పటికీ బెంగళూరు ఎఫ్‌సీ విజయాన్ని కాపాడుకుంది. మరో మ్యాచ్‌లో ఎఫ్‌సీ గోవా జపాన్‌కు చెందిన సాగన్ టోసుతో హోరాహోరీగా పోరాడినా 1-0 తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ ఆరో నిమిషంలోనే జెన్ర్యూ ఓనో చేసిన గోల్ ఆతిథ్య జట్టుకు విజయాన్ని అందించింది. ఆ తర్వాత ఎక్కువసేపు బంతిపై ఆధిపత్యం ప్రదర్శించిన గోవా, రెండో అర్ధభాగంలో పలు అవకాశాలు సృష్టించినా వాటిని గోల్స్‌గా మలచలేకపోయింది. జపాన్ జట్టు క్రమశిక్షణతో కూడిన రక్షణను ఛేదించడంలో విఫలమవడంతో గోవా ఖాళీ చేతులతో మ్యాచ్ ముగించింది.




## వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్

రాజేందప్రసాద్, శ్రీకాంత్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్' . జి.నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో వేంకటేశ్వర స్వామిగా రాజేందప్రసాద్ నటించగా.. భక్తుడిగా శ్రీకాంత్ కనిపించనున్నారు.

-------

# తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్య దృష్టి

### సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్



అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

## రావ్ బహద్దూర్ అందరూ చూడాల్సిన మూవీ

### ప్రశంసలు కురిపించిన దర్శకుడు సందీప్ వంగా



ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే విడుదలైన 'రావ్ బహదూర్' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకున్నారు. సినిమాను గొప్పగా తీసిన చిత్ర బృందాన్ని అభినందించారు. మనం సినిమాను ఎందుకు అంతగా ప్రేమిస్తామో మరోసారి గుర్తుచేసే అరుదైన చిత్రాల్లో 'రావు బహదూర్' ఒకటి. సినిమా ప్రేమికుడికి నాదొక చిన్న విన్నపం.. మీ జీవితంలోని మూడు గంటల సమయాన్ని 'రావ్ బహదూర్'కు ఇవ్వండి. కచ్చితంగా మీకు నచ్చుతుంది. అన్ని ప్రశంసలు అందుకునేందుకు దీనికి పూర్తి అర్హత ఉంది. వెంకటేశ్ మహా తక్కువ బ్జడెట్‌లో అద్భుతంగా రూపొందించారు. ఎంతో ధైర్యం, తనపై తనకు బలమైన నమ్మకం ఉన్న వాళ్లు మాత్రమే ఇలా తెరకెక్కించగలరు. ఇక సత్యదేవ్ తన నటనతో అదరగొట్టారు. ఇందులో ఎలాంటి అనవసరమైన హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు. కేవలం స్వచ్ఛమైన కథ మాత్రమే కనిపిస్తుంది' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇలాంటి సినిమాలను కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలని అన్నారు.

----------



## తుంబాడ్-2 లో ఆలియా

భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది' అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బ్జడెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

----


## తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం

### జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా




విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం.సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## 'తెలుగు సినిమా.. హిందీ సినిమా' ఇదేం విభజన? - అడివి శేష్



భాషల ఆధారంగా సినిమాలను విభజించే విధానంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని హీరో అడివి శేష్ అభిప్రాయపడ్డాడు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమాలను ఒకే భాషకు పరిమితం చేయడం సరైన విధానం కాదన్నాడు. దేశమంతా ఆదరించే కథలకు భాష అడ్డంకిగా మారకూడదని అభిప్రాయపడ్డాడు.ఇప్పటికీ 'హిందీ సినిమా', 'తెలుగు సినిమా', 'తమిళ సినిమా' అంటూ వేర్వేరుగా పిలుస్తూనే, మరోవైపు 'పాన్ ఇండియా సినిమా' అనే పదాన్ని ఉపయోగించడం ఆసక్తికరంగా అనిపిస్తోందని శేష్ చెప్పాడు. ఒక సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకులతో భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచగలిగితే దాని గుర్తింపును భాషతో ఎందుకు పరిమితం చేయాలని ప్రశ్నించాడు. కథలను భాషల గీతల్లో కాకుండా భారతీయ కథలుగా స్వీకరించినప్పుడే నిజమైన పాన్ ఇండియా సినిమా ఆవిష్కృతమవుతుందని అన్నాడు.

భాష అనేది భావాలను వ్యక్తీకరించే సాధనం మాత్రమేనని, అది ఎప్పుడూ పరిమితిగా మారకూడదని అడివి శేష్ పేర్కొన్నాడు. ఇప్పుడు ప్రేక్షకులు గతంతో పోలిస్తే ఎంతో మారిపోయారని చెప్పాడు. మంచి కథ ఎక్కడి నుంచి వచ్చినా ఆదరిస్తున్నారని, ప్రేక్షకుల ఆలోచనా విధానానికి తగ్గట్టు సినీ పరిశ్రమ కూడా మారాల్సిన అవసరం ఉందన్నాడు.సినీ సృష్టికర్తల బాధ్యత నిజాయతీతో కూడిన కథలను అందరికీ చేరేలా రూపొందించడమేనని శేష్ అన్నాడు. ఒక భాష మార్కెట్‌ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా దేశం మొత్తం సొంతం చేసుకునే సినిమాలను రూపొందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పాడు.ప్రస్తుతం అడివి శేష్ నటించిన 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్, సునీల్, జైన్ మేరీ ఖాన్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. అలాగే 'గూఢచారి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'జీ2' చిత్రంలో కూడా అడివి శేష్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, వామికా, మధు శాలిని ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.